విప్లవ జ్వాలలు!!

సంపత్

టెలిఫోన్ మోగటంతో రసీవర్ అందుకున్నాడు మనోహార్.

"మనోహార్ గారా? నేను పరమశివాన్ని మాట్లాడుతున్నాను. దయచేసి నాకోసం వేచివుండగలరా?" అని విన్పించింది.

"పరమశివమా?" సాలోచనగా అన్నాడు మనోహార్.

"అవునండి. సంవత్సరం క్రితం సౌందర్ రాజన్ గారి పెళ్ళిలో కలుసుకున్నాం."

"ఆఁ! ఆఁ! గుర్తొచ్చింది. రండి. యేమిటి విషయం?"

"అంతా అక్కడకు వచ్చాక చెబుతాను" అన్నాడు పరమశివన్.

"ఆల్ రైట్. ప్రస్తుతం నాకేం పని లేదు. రండి...!"

"పావుగంటలో వుంటానక్కడ" అని ఫోన్ పెట్టేశాడు పరమశివన్.

పరమశివన్ తమిళుడే అయినా 'పలూన్' దీవిలో నివాసం ఏర్పరచుకున్నాడు. 'పలూన్ ఐలెండ్'కి వ్యవహారిక నామం 'స్వీట్ లాండ్'. అక్కడ చెఱకు ఎక్కువగా పండుతుంది.

పరమశివన్‌కి అక్కడ నాలుగయిదు చెఱకు ఎస్టేట్లు, ఫ్యాక్టరీలు ఉన్నట్లు ఆ ఐలెండ్‌లోని ధనవంతులలో పరమశివన్ ఒకడని మనోహర్‌కి గుర్తుకొచ్చింది. అయితే అతనికి తనతో పనేమిటో వూహించలేకపోయాడు.

అన్నట్లుగానే పావుగంట తరవాత వచ్చాడు పరమశివన్. అతనికి యాభైయేళ్ళపయినే ఉంటాయి. ఎనభై ఏళ్ళవాడిలా కన్పిస్తున్నాడు. ముఖంలో దిగులు, ఏదో బాధ అతన్ని పట్టి పీడిస్తున్నట్లుంది.

"క్షమించండి. మీతో నాకున్న స్వల్ప పరిచయాన్ని పురస్కరించుకొని సాయం కోరటానికి వచ్చాను" అన్నాడు పరమశివన్.

"చెప్పండి" లోలోపల ఆశ్చర్యపోతూ అన్నాడు మనోహర్.

"బహూశా నా గురించి మీకు తెలిసేవుంటుంది. చిన్నప్పుడే 'స్వీట్‌లాండ్' పారిపోయాను. అక్కడే పెరిగి పెద్దవాణ్నయ్యాను. నా భార్య చనిపోయి అయిదేళ్ళవుతోంది. ఒక్కడే కొడుకు. వాడి పేరు తంగరాజు. పాతికసంవత్సరాల వయసుంటుంది వాడికి.

స్వీట్‌లాండ్ గురించి మీరు వినే ఉంటారు. ప్రస్తుతం అక్కడే 'చుంగ్ మిన్' అధికారంలో ఉన్నాడు. అతన్ని దించి, అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తుందో ముఠా,

ఆ ముఠాకి రష్యా సహాయ సహకారాలున్నాయని వదంతి ఉంది.

ఎంత చెప్పినా వినకుండా ఆ విప్లవవాదుల ముఠాలో నా బిడ్డ చేరిపోయాడు. నామీద కూడా దాడి జరుగు తుందన్న భయంతో నేను ఇండియా వచ్చేశాను.

మీరు గుర్తుకు వచ్చారు. మీరిదివరలో సిబిఐలో ఆఫీసర్ గా పనిచేశారని నాకు తెలుసు. మీరే నాకు సహాయం చేయాలి. తంగరాజును యెలాగయినా ఇక్కడకు తీసుకు రావాలి. బలవంతంగా నయినాసరే!'' ప్రాధేయపడుతూ అన్నాడు పరమశివన్.

'స్వీట్ లాండ్'తో అనేక దేశాలకు, భారతదేశంతో సహా మంచి సంబంధాలే ఉన్నాయి. అక్కడ ప్రస్తుతం సంఘర్షణ జరుగుతోందని మనోహర్ కి తెలుసు. మిలిటరీ రాజ్యం లేకపోయినా, అధికారం మాత్రం పోలీసుల చేతుల్లో నిబిడీకృతమై ఉంది. ప్రభుత్వంమీద దాడులు జరుపుతున్న విప్లవ సైన్యాన్ని ఎప్పటికప్పుడు గట్టిగా అణచివేస్తున్నాడు చుంగ్ మిగ్. ఈ వివరాలు ఏ రోజు కారోజు విదేశ పేపర్లలో వస్తూనే వుంటాయి.

స్వీట్ లాండ్ నానాజాతుల కలగలుపు. చైనీయులు, భారతీయులు, జపనీస్, ఫ్రెంచ్, రష్యన్స్, అమెరికన్స్ మొదలయిన దేశస్థులు అక్కడ నివాసం యేర్పరచు కున్నారు.

''మీ మాట వినని తంగరాజు, నా మాట విని వస్తా డని ఎందుకనుకుంటున్నారు?'' అని ప్రశ్నించాడు మనో హర్.

తటపటాయించి అన్నాడు పరమశివన్. ''తంగరాజుని మాయం చేశారని నా అనుమానం, గత నాలుగయిదు

రోజులుగా అతని ఆచూకీ తెలియలేదు. అతన్ని గురించి ఆచూకీ తీసి, ఇండియా తీసుకురావాలి, ఎంత ఖర్చయినా సరే!'' అన్నాడు దీనంగా పరమశివన్.

''అపహరించారా?'' తెల్లబోయి అడిగాడు మనోహర్.

''అక్కడకు వెళితే నిజానిజాలు మీకే తెలియగలవ్. నా మాట కాదనకండి. ప్లీజ్!''

''ఆలోచించి ఏ విషయమూ రేపు చెపుతాను'' అన్నాడు మనోహర్.

2

ఆ సాయంత్రమే సి.బి.ఐ. ఆఫీసుకి వెళ్ళాడు మనోహర్. ఫారిన్ ఎఫైర్స్ వింగ్ డైరెక్టర్ ముఖర్జీ నవ్వుతూ ఆహ్వానించాడు మనోహర్‌ని.

''చాలా కాలం అయింది కలుసుకుని. చిన్న పనిమీద వచ్చాను'' అన్నాడు మనోహర్.

''ఏమిటి?''

''స్విట్‌లాండ్ గురించి వివరాలు కావాలి. ప్రజెంట్ పొలిటికల్ సిట్యువేషన్‌తో సహా.''

దీర్ఘంగా నిస్వశించి చెప్పటం ప్రారంభించాడు ముఖర్జీ.

''స్విట్‌లాండ్ ప్రస్తుతం 'చుంగ్ మిన్' పరిపాలనలో ఉంది. అతనికి యాభై అయిదేళ్ళు. పేదకుటుంబంలో పుట్టి మిలిటరీలో చేరాడు. అలా పైకి వచ్చి, ఇంతకుముందు రాజు 'మోజింగ్' అనంతరం రాజ్యాధికారి అయ్యాడు. అతనంటే గిట్టని కొందరు విప్లవ ముఠాగా యేర్పడ్డారు. ఆ ముఠా నాయకుడి పేరు జార్మన్. ముప్పైసంవత్సరాలుంటాయి,

ఇకపోతే సుమారు నాలుగయిదు రోజుల క్రితం మిలిటరీ క్యాంప్ ఒకదానిమీద విప్లవవాదులు దాడి చేశారు. ఈ వార్తల్ని ప్రభుత్వం బయటికి పొక్కనివ్వదు. అక్కడ సెన్సార్‌షిప్ అమలులో వుంది. విదేశీ విలేఖరులు మాత్రం అతి కష్టంమీద వార్తలు సేకరిస్తుంటారు.

ఇదీ అక్కడి పరిస్థితి. అన్నట్లు ఇదంతా ఎందుకు?'' అని ప్రశ్నించాడు ముఖర్జీ.

''నాకో కేస్ వచ్చింది'' అంటూ పరమశివన్ గురించి చెప్పాడు మనోహర్.

''ఇంకేం బయలుదేరు. గూఢచారి చర్యలు అలవాటేగా?'' అన్నాడు నవ్వుతూ ముఖర్జీ. నవ్వాడు మనోహర్.

''ఎటూ వెళుతున్నావు గదా! ఓ చిన్నపని చేసిపెట్టు వీలయితే'' అంటూ ఫైల్ రాక్‌లోనుంచి ఓ ఫైలు తీసుకొచ్చి మనోహర్ ముందుకి తోశాడు ముఖర్జీ.

అది ''చాయింగ్'' అనే చైనా గూఢచారికి సంబంధించిన ఫైలు. అతని ఫోటో, ఆకార విశేషాలు,వివరాలూ ఉన్నాయి.

''చాయింగ్ గురించి నీవు వినేవుంటావు. ఈ మధ్యకాలంలో విపరీతంగా వినబడుతోందతని పేరు. ఇదివరకు ఇండోనేషియాలో ఉండేవాడు. అక్కడ్నుంచి హఠాత్తుగా మాయం అయ్యాడు. తరువాత అతని గురించి తెలియలేదు. స్విట్‌లాండ్ చేరుకున్నాడని వార్తలు వచ్చాయి. అదీ నిర్ధారణంగా తెలీదు.

అతను 'ఫ్లామింగ్' అన్న మారుపేరుతో ఆ దీవిలో ఉంటున్నట్లు తెలిసింది. నీవు వాకబ్ చేసి ఏ విషయమూ

చెప్పాలి. ఒక్క విషయం గుర్తుంచుకో! నీవిలా గూఢ చారి చర్యలు సాగిస్తున్నావని తెలిస్తే అంతు తెలియకుండా మాయం అవుతావ్. జాగ్రత్త!''

''అది మామూలేగా!'' అంటూ సెలవుతీసుకున్నాడు మనోహర్. అటునుంచి లైబ్రరీకి వెళ్ళి విదేశీ పత్రికలు తిరగేసి 'స్వీట్‌లాండ్' గురించిన వివరాలు చదివాడు.

అతని కంటికి రెండురోజులక్రితం జరిగిన సంఘటన కన్పించింది. స్వీట్‌లాండ్‌లో ఒక షిప్ ప్రమాదంలో 'రామన్' అనే వ్యక్తి జాడ తెలీకుండా పోయాడని, షూమింగ్ అనే మనిషి చనిపోయాడని వుంది.

అదిరిపోయాడు మనోహర్. షూమింగ్-కైనా గూఢ చారి!

3

స్వీట్‌లాండ్ రాజధాని 'కంపా'నగరంచేరేసరికి స్థానిక కాలమానం ప్రకారం ఉదయం ఎనిమిదిగంటలు అవుతుంది.

ఎయిర్‌పోర్టు బయటికి వచ్చి టాక్సీ ఎక్కి 'హోటల్ బ్లూ డైమండ్'కి పోనివ్వమన్నాడు మనోహర్.

స్వీట్‌లాండ్ దాదాపు రెండువందల చదరపుమైళ్ళ వి స్తీర్ణంగల దీవి. రాజధాని నగరం 'కంపా'లో లక్ష జనాభా ఉంటుంది. అదే ప్రధాన నగరం కూడా. 'కంపా' సిటీ చుట్టూరా చెట్లు, చేమలు, కొండలు ఎక్కువ. ఆ దీవి మొత్తంమీద పది పన్నెండు చిన్న గ్రామాలవంటి పట్నాలు ఉన్నాయి, 'కంపా'ని మిన హాయించి.

అక్కడ యెక్కువగా ఇంగ్లీషే మాట్లాడుతుంటారు. అందుకు కారణం ఆ దీవి యిదివరలో బ్రిటిష్ పరిపాలన

క్రింద ఉండి, విమోచన పొందింది. ఇంగ్లీషుగాక మరో రెండు, మూడు స్థానిక భాషలున్నా వాటి ప్రాశస్త్యం తక్కువ.

'కంపా' సిటీ దాదాపు భారతదేశంలోని సగటు నగరం లాగే తోచింది మనోహర్‌కి. రద్దీగా ఉన్న వీధులు, ముష్టివాళ్ళు, విదేశీయులు, క్లబ్బులు, బార్లు కూడా కనుపించాయి.

'బ్లూ డైమండ్' చేరుకుని తనకు రిజర్వు చేయబడిన సూట్‌లో దిగాడు. స్నానాదికాలు ముగించి, కాఫీ తాగుతూ పేపరు చూశాడు. అక్కడ నాలుగయిదు పత్రికలున్నాయి. ప్రతి పత్రికా ప్రభుత్వాన్ని పొగిడినట్లుగానే ఉన్నాయి. అక్కడక్కడ విప్లవదేశాలవల్ల జరిగిన అల్లరులను అంత ప్రాధాన్యత లేకుండా ఏ మారుమూలో క్లుప్తంగా వేశారు. అదయినా విదేశీ తొత్తుల దురాగతాలంటూ.

పత్రికలు పక్కన బెట్టి బయటికి వచ్చాడు మనోహర్. తండ్రితో పోట్లాడి విడిగా 'హోటల్ రిడ్జ్'లో ఉంటున్నాడు శంకరాజు.

ఆ హోటల్‌కి పోయి వాకబు చేశాడు మనోహర్.

"సారీసర్! అయిదురోజుల క్రితమే అతను ఖాళీచేశాడు" అంది రిసెప్షనిస్ట్ రిజిష్టర్ చూసి.

"అర్జెంటుగా కలుసుకోవాలతన్ని!" అన్నాడు మనోహర్.

"బహుశా డార్లింగ్ బార్‌లో ట్రై చేయండి. అక్కడ దొరుకుతాడేమో!" అంటూ ఆ బార్ ఎక్కడుందో చెప్పిందామె.

వెంటనే టాక్సీ ఎక్కి నగర శివార్లలో ఉన్న

పార్కింగ్ బార్ కి బయలుదేరాడు మనోహర్.

రోడ్ కిరువైపులా రకరకాల దుకాణాలు, ఇళ్ళు కన బడుతున్నాయి. ధనవంతుల భవంతులు, మధ్యతరగతి గృహాలు, పేదల నివాసాలు మొదలయినవి.

కొంతదూరంవచ్చాక టాక్సీని ఆపించాడు మనోహార్. అక్కడ ఉన్న ఒక భవంతిమీద "సలూన్ పోలీస్ హెడ్ క్వార్టర్స్" అన్న బోర్డుంది.

"అరగంటలో వస్తాను. వెయిట్ చేస్తూండు" అని చెప్పి లోనికి వెళ్ళాడు మనోహర్.

సెంట్రీ యేమి కావాలన్నట్లు చూశాడతనివంక.

"కమీషనర్ గారున్నారా?" అని ప్రశ్నించాడు మనోహార్.

"మీ రెవరు? వారితో ఏం పని?" ఎదురు ప్రశ్నించా డతను.

జేబులోనుంచి సీల్ చేసిన ఒక ఎన్వలప్ తీసి అతని కిచ్చాడు మనోహర్. "దీనిని కమీషనర్ గారికివ్వు."

మనోహర్ ని ఎగాదిగా చూసి లోనికి పోయాడు సెంట్రీ. అయిదు నిమిషాలలో తిరిగి వచ్చాడతను. "ఇలా రండి!" అంటూ మనోహార్ ని, కమీషనర్ గదిలోకి తీసుకు పోయాడు.

"గ్లాడ్ టు మీట్ యు. నా పేరు జోకోచ్" అన్నాడు కమీషనర్ చేయి జాపుతూ.

"నా పేరు మనోహార్" అంటూ చేయి ఇచ్చి, షేక్ హాండిచ్చాడు.

"ప్లీజ్ బి సీటెడ్" అని సెంట్రీవంక తిరిగి 'టీ' తెమ్మని చెప్పాడు.

టేబుల్ మీద మనోహార్ ఇచ్చిన ఎన్వలప్ తెరిచి

ఉంది. దాని ప్రక్కన ఒక కాగితం ఉంది.

ఆ కాగితాన్ని మరోసారి చదివాడు జోరోచ్.

డియర్ కమీషనర్!

ఈ లెటర్ ఇచ్చినవ్యక్తికి నా కత్యంత ఆప్తుడు. అతని బిజినెస్ మీద స్వీట్‌లాండ్ వస్తున్నాడు. అతనికి కావలసిన సహాయం చేయవలసింది. అలా చేస్తావని అనుకుంటున్నా.

నీ

పరమశివన్.

"పరమశివన్ మీకు బాగా తెలుసా?" అని ప్రశ్నించాడు జోరోచ్.

తెలుసన్నట్లు తలూపాడు మనోహర్. ఇంతలో 'టీ' వచ్చింది.

ఇద్దరూ టీ చప్పరించసాగారు.

"మీరు వచ్చిన పనేమిటి?" అని ప్రశ్నించాడు జోరోచ్.

"నేను ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ ఇన్వెస్టిగేటర్‌గా పని చేస్తున్నాను. ఒకవ్యక్తి ఒక కేసులో సాక్షిగా కావాల్సి వచ్చాడు. అతను యిక్కడ ఉంటున్నాడని తెలిసి వస్తుంటే, పనిలో పనిగా పరమశివన్ కొడుకు కూడా యిక్కడ వుంటున్నట్లు చెప్పి, అతన్ని తీసుకురావల్సిందిగా కోరాడు పరమశివన్. మీ గురించి చెప్పి ఈ లెటరు ఇచ్చారు."

"ఐ. సీ! మీకు నా సహాయం ఎప్పుడూ ఉంటుంది. మీకు కావల్సిన మనిషి పేరేమిటి? యెక్కడుంటు దుంటున్నాడు?"

కొంచెం తటపటాయించి చెప్పాడు మనోహర్. "అత

నే పేరుతో వుంటున్నాడో తెలీదు. 'ఘూమింగ్' అతని పేరు."

"ఘూమింగా?" అదిరిపడ్డాడు జోరోచ్.

"ఏం మీకు తెలుసా?" ఆతృత కనబరిచాడు మనోహర్.

రెండు నిమిషాలు ఆలోచించి "తెలుసు. అతను మరణించాడు" అన్నాడు అతను. "ఎవరో హత్య చేశారతన్ని."

ఈసారి నిర్ఘాంతపోవటం మనోహర్ వంతు అయింది. ఘూమింగ్ చనిపోయినట్లు తెలుసుగాని, హత్య చేయబడినట్లు తెలీదు.

కమీషనర్ జోరోచ్ రీసెర్చి షిప్‌లో జరిగిన ఒక దుర్ఘటన గురించి చెప్పాడు. చెప్పి "మీ ప్రయత్నం వృథా అవుతుందేమో!" అన్నాడు.

ఆలోచనలనుంచి తేరుకుని "నెవర్ మైండ్!" అన్నాడు బలవంతంగా నవ్వుతూ, మనోహర్.

"ఓ. కే! నేనిక వెళ్తాను. మళ్ళీ కలుసుకుందాం" అని బయటకి నడిచాడు మనోహర్.

శార్మింగ్ బార్‌లో వాకబు చేస్తే, తంగరాజుని ఎరిగిన వాళ్ళెవరూ కన్పించలేదు.

తిరిగి వచ్చేశాడు మనోహర్.

4

'ఘూమింగ్' అన్న మారు పేరుతో ఉంటున్న కైనా ఏజంటు 'చాయింగ్' హత్య చేయబడటం వింతగా తోచింది మనోహర్‌కి.

చాయింగ్ లాంటి అనుభవజ్ఞుడయిన గూఢచారి అంత తేలిగ్గా ఎలా మరణించాడు? అతన్ని చంపిందెవరు?

ఎందుకు చంపారు? అసలు జోరోచ్ చెబుతుంది నిజమా, కాదా?

ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలంటే తాను రీసెర్చ్ షిప్ డైరక్టర్‌ని కలుసుకోవాలి. అక్కడయినా తనకు సరి అయిన సమాధానాలే వస్తాయా?—అనుకుంటూ మరుసటి రోజు ఉదయం జోరోచ్‌ని కలుసుకున్నాడు.

"ఫ్లూమింగ్ మరణించాడని నిర్ధారణగా తెలుసుకోవాలని అనుకుంటున్నాను. అంతేగాదు, ఈ సంగతి అధికారులతో చెప్పి, ఋజువులు చూపితేగాని ఊరుకోరు. కనుక షిప్ డైరక్టర్‌ని కలుసుకుని సర్టిఫికెట్ తీసుకోవాలనుకుంటున్నాను. ఆ షిప్ ఎక్కడుంది?" అని అడిగాడు మనోహర్.

తటపటాయిస్తూనే చెప్పాడు జోరోచ్.

'థాంక్స్' చెప్పి బయటపడ్డాడు మనోహర్.

తీరంలో వున్న ఒక చిన్న మోటర్ బోట్‌ని రెంట్‌కి తీసుకుని షిప్ వైపు బయలుదేరాడు.

త్వరలోనే షిప్ కన్పించింది. డెక్ మీద నిలబడి ఏదో చేస్తున్నారు కొంతమంది. షిప్‌కి ఒక ప్రక్క, గోడకి అతుక్కొని వుందో యినుపనిచ్చెన ఏటవాలుగా.

మనోహర్‌ని చిత్రంగా చూశారు ఆ మనుషులు.

"ప్రొఫెసర్ కర్టిస్‌ని కలుసుకోవాలి" అన్నాడు మనోహర్.

అతన్ని కర్టిస్ వున్న కాబిన్‌లోకి తీసుకుపోయాడు.

పరస్పర పరిచయాలయ్యాక అసలు విషయంలోకి దిగాడు మనోహర్.

"బాతిస్ఫియర్ గురించి మీ కెవరు చెప్పారు?" ఆశ్చర్య పోయి అన్నాడు ప్రొఫెసర్ కర్టిస్.

"కమీషనర్ జోరోచ్"

"ఐ.సీ. మీకు పోలీసు డిపార్టుమెంట్‌లో మంచి పలుకుబడే వుందన్నమాట. లేకపోతే సెన్సార్ షిప్ వున్నా ఈ ఐలెండ్‌లో మీవంటివారికి అసలు విషయం తెలియనివ్వరు."

"నిజమే!" ఒప్పుకున్నాడు మనోహర్.

"మీతో జోరోచ్ చెప్పింది నిజమే. నేనిక్కడ లేని సమయంలో నా అసిస్టెంట్‌గా చేరిన యిద్దరు బాతిస్ఫియర్‌లో సముద్ర గర్భంలోకి దిగారు. 700 అడుగుల లోతులో షూమింగ్ ఏదో భయంకర దృశ్యం చూసి అరిచాడట. అదేమిటో తెలుసుకునే లోపే బాతిస్ఫియర్‌కి, షిప్‌కి మధ్య సంబంధం కట్ అయింది. వాళ్ళు సముద్రం పాలయ్యారు.

నేను వచ్చాక చూస్తే 1200 అడుగుల లోతులో కన్పించింది బాతిస్ఫియర్. లోపల కత్తితో హత్య చేయబడి 'షూమింగ్' ఒక్కడే వున్నాడు. రెండో వాడు 'రామన్' జాడ లేదు."

"ఆ చనిపోయింది షూమింగేనని ఖచ్చితంగా చెప్ప గలరా?" అని ప్రశ్నించాడు మనోహర్.

"అతను ధరించిన దుస్తులు షూమింగ్‌వే. అప్పటికే సముద్రపు చేపలు శవాన్ని కొరుక్కు తిన్నాయి బాగా. బాడీకూడా షూమింగ్‌దే!" అన్నాడు కర్టిస్.

"అయితే 'రామన్' ఎలా మాయం అయ్యాడంటారు? లోపలికి వెళ్ళిన తరువాత షూమింగ్‌ను హత్యచేసి తలుపు తెరుచుకుని పారిపోయి వుంటాడా?"

"ఇంపాజిబుల్. 700 అడుగుల లోతులో ప్రెషర్ విపరీతంగా వుంటుంది. తలుపు తీయటం సాధ్యంకాదు. ఒక వేళ ఎలాగోలా తీశాడని భావించినా, తీసీ, తీయక ముందే మరణిస్తాడు. అయినా మీరో విషయం మరిచి పోతున్నారు. ఏదో భయంకర దృశ్యం చూసి అరిచిన షూమింగ్‌ని హత్యచేసి, బయటికి పోయేంత వ్యవధి 'రామన్'కి వుండదు."

"అదలా వుంచండి. షూమింగ్ చూసిన దృశ్యం గురించి మీ ఉద్దేశ మేమిటి?"

"ఏముంది? ఏ భయంకర జంతువో, తిమింగలమో వారికి కనబడి వుంటుంది. సముద్రం గురించి మానవుడికి సంపూర్ణంగా తెలియదు. డైనోసార్స్, రైనోసార్స్‌లాంటి జంతువులు సముద్రము అడుగున వున్నాయి."

"సారీ ప్రొఫెసర్! మీకు యిబ్బంది కలిగిస్తున్నాను. నేనుకూడా ఆ బాతీస్ఫియర్‌ని చూడవచ్చా?" అని వినయంగా అడిగాడు మనోహర్.

"ష్యూర్! కాని ఇప్పుడు కాదు. ఇంకా అది సముద్ర గర్భంలోనే వుంది. దానిని పైకి తీయాలంటే స్పెషల్ క్రేన్స్ కావాలి, అవి వున్న షిప్ రేపో, ఎల్లుండో ఇక్కడకు వస్తుంది."

"థాంక్స్ ప్రొఫెసర్! మరలా కలుసుకుంటాను." అని బయటికి వచ్చాడు.

బోట్‌లో బయలుదేరిన మనోహర్ బుర్రలో ప్రొఫెసర్ మాటలే తిరుగుతున్నాయి.

సెన్సార్‌షిప్ విధించి బయటికి రానివ్వని వార్తను, పేర్లతోసహా జోర్రోచ్ తనకెందుకు చెప్పినట్లు?

ఆ మరణించింది షూమింగేనా? రామన్ ఏమయ్యాడు?

5

హోటల్‌కి తిరిగివచ్చి భోజనం ముగించి కూర్చున్నాడు మనోహర్. అతనికి 'రంగరాజు'ని ఎలా ట్రేస్ చేయాలో అర్థంగావేదు. పరమశివన్‌కి సంబంధించిన మనుషుల దగ్గర వాకబుచేస్తే ఏదయినా క్లూ దొరుకుతుందా?

వెంటనే 'రెంట్'కి తీసుకున్న ఒక కారులో బయలు దేరాడు.

"పరమశివన్ ఎస్టేట్స్" అన్న బోర్డు కన్పించింది ఒక భవనం ముందు.

"మిస్ రజీనా ఉందా?" అని అడిగాడు రిసెప్షనిస్ట్‌ని. రజీనా పరమశివన్ తరఫున అక్కడ పనిచేస్తోంది. అతను లేనప్పుడు ఆయన వ్యవహారాలు ఆమే చూస్తుంటుందని, చాలా నమ్మకస్తురాలని చెప్పాడు పరమశివన్.

"మేడమీద వున్నారు. వెళ్ళండి" అంది రిసెప్షనిస్టు.

మెత్తటి కార్పెట్ పరిచివున్న మేడమెట్లు ఎక్కి పైనున్న ఒక నడవాలోకి ప్రవేశించాడు. అక్కడకూడా మెత్తటి ఎర్రటి కార్పెట్ పరచి వుండటంవల్ల బూట్లశబ్దం రావటంలేదు.

నడవాకి అటూ యిటూ గదులున్నాయి. వరండా చివరగా వున్న గది తలుపుమీద 'మిస్ రజీనా' అన్న బోర్డుంది.

ఆ గదిని సమీపించేకొలది లోపల ఎవరో ఘర్షణపడు తున్నట్లు మాటలు పెద్దగా విన్పించసాగాయి. సందే హిస్తూనే వాటిని ఆలకించసాగాడు మనోహర్.

"ఇడియట్. ఇలా బెదిరించి నాదగ్గర డబ్బు రాజేయ లేవు. గెటౌట్" అరుస్తోందో ఆడగొంతు. రజీనా గొంతు అనుకున్నాడు మనోహర్.

"రజీనా! ఇది నీ బాబు ఆస్తిగాదు. నేనూ పార్ట్నర్ నే. మాకు లేని దురద నీ కెందుకు? నువ్వు తంగరాజు తిరుగుతుండటం నేను చూశానని పరమశివన్ తో చెబితే నీ వేమవుతావో ఆలోచించుకో. ఆయనసలే కొడుకు మాయం అయ్యాడని కంగారుపడుతున్నాడు. వెంటనే నిన్ను ఉద్యోగంలోంచి పీకేస్తాడు" అంటోందో మగ గొంతు.

"షటప్! గెటౌట్ ఫ్రం హియర్!" ఆపైన చెంప మీద కొట్టిన చప్పుడు.

విసురుగా నడిచిన చప్పుడు విని, చటుక్కున మెట్లదగ్గరకు పరుగెత్తాడు మనోహర్.

ధడాలున తెరుచుకుని నలభై అయిదేళ్ళ వ్యక్తి ఒకడు విసురుగా బయటికి వచ్చాడు. అతని ముఖం కందగడ్డలా ఉంది. మనోహర్ ని రాసుకుంటూ పెద్దపెద్ద అంగలు వేస్తూ క్రిందకు వెళ్ళిపోయాడు.

అప్పుడే పైకి వస్తున్నట్లు నటిస్తూ "హల్లో మిస్ రజీనా, నా పేరు మనోహర్. మీతో మాట్లాడాలి" అన్నాడు మనోహర్.

గుమ్మంలో నిలుచున్న రజీనా ఆవేశం తగ్గించుకుంటూ "ఎవరు మీరు? ఏం కావాలి?" అని అని అడిగింది కఠినంగానే. ఆమె ముఖంనిండా చెమటలు పోసివున్నాయి. అందమయినదే. పాతికేళ్ళకు మించి వుండవు.

"లోపలికి పదండి" అన్నాడు అతను.

"చెప్పండి" అంది రజీనా ఇరువురూ కూర్చున్న తరువాత.

"తంగరాజు ఎక్కడున్నాడో మీకు తెలుసా? అతన్ని చివరిసారిగా ఎక్కడ చూశారు?"

"రెండువారాలపైనే అవుతుంది" అంది రజీనా.

"ఆ తరువాత చూడలేదా?" ఇందాకటి వ్యక్తి మాటలు మననం చేసుకుంటూ ప్రశ్నించాడు మనోహర్.

"లేదు. అతని గురించి నాకు తెలియదు" నిష్కర్షగా చెప్పింది మిస్ రజీనా.

ఆమె ఆవేశంలో వుందని గ్రహించి "తరువాత కలుస్తాను" అని బయటపడ్డాడు మనోహర్.

అతనలా బయటికి పోగానే ఫోన్ ఎత్తి ఎవరికో డయల్ చేసింది రజీనా.

"నువ్వన్నట్లు ఇక్కడకు వచ్చాడు, ఏమీ తెలియదని బుకాయించాను' చెప్పిందామె.

6

మిస్ రజీనా అబద్ధం చెబుతుందని, ఆమె ఏదో దాస్తుందని అర్థం అయింది మనోహర్ కి. అయితే ఏ విషయమో అర్థంగాలేదు.

రిసెప్షనిస్ట్ దగ్గరికి వెళ్ళి "ఇందాక వెళ్ళిన వ్యక్తి ఎవరు?" అని అడిగాడు.

"అతని పేరు పళనిస్వామి. పరమశివన్ గారికి బంధువవుతారు. ఈ ఫ్యాక్టరీలో ఆయనకు కూడా వాటా వుంది."

"మనిషి ఎటువంటివాడు?"

"ఉత్త తాగుబోతు. ఎంత డబ్బున్నా తాగుడుకే చాలదు. అది మినహా మనిషి మంచివాడే." చెప్పింది రిసెప్షనిష్టు.

"థాంక్స్! నేనిలా అడిగినట్లు ఎవరితోనూ చెప్పకు!" అని ఆమె కొక నోటు అందించి, పళనిస్వామి అడ్రసు తెలుసుకుని బయటపడ్డాడు.

మిస్ రజీనా గురించి తెలుసుకోవాలంటే పళనిస్వామిని కలుసుకోవాలి. అతనిప్పుడు వుంటాడో, వుండడో అనుకుంటూ కారుని పళనిస్వామి ఇంటివైపు తిప్పాడు.

రెండునిముషాల తరువాత తన వెనక ఒక కారు ఫాలో కావటం గమనించి చకితుడయ్యాడు మనోహర్. అది పోలీసుల కారు. లోపల జోరోచ్ కనబడుతున్నాడు కూడా.

అతను తనని వెంటాడుతున్నాడని రూఢి కాగానే మనోహర్ భృకుటి ముడిపడింది. జోరోచ్ తనని ఎందుకు అనుసరిస్తున్నాడు? ఈ సమయంలో పళనిస్వామిని కలుసుకోవటం మంచిది కాదేమో అనుకుంటూ, అతని ఇంటి దాపుల్లో ఒక పార్కుదగ్గర కారాపాడు మనోహర్.

నిముషం తరువాత జోరోచ్ కారు అతనిప్రక్క ఆగింది. జోరోచ్‌ని అప్పుడే చూసినట్లు ఆశ్చర్యం నటించాడు మనోహర్.

మనోహర్‌ని కొంచం దూరంగా తీసుకుపోయి "మిస్టర్ మనోహర్. మీరీ దీవిలో వుండటం అంత మంచిదిగాదు. దయచేసి వెంటనే వెళ్ళిపోండి. ఇది నా రిక్వెస్టుగా భావించండి." అన్నాడు జోరోచ్.

"బట్ సర్..." అనబోయాడు ఏదో, మనోహర్.

"సారీ మనోహర్! దాన్ని గురించి తర్కించకండి. వెంటనే దీవిని విడిచి వెళ్ళటం మీకే శ్రేయస్కరం!" మనోహర్ మాట్లాడే అవకాశం ఇవ్వకుండా గబగబ పోయి కారెక్కాడు జోరోచ్. కదిలి, పోయిందది.

జోరోచ్ ప్రవర్తన వింతగా తోచింది మనోహర్‌కి. ఇంతవరకు ఎంతో కోఆపరేట్‌గా వున్న అతను ఇంత హఠాత్తుగా ఎందుకు మారిపోయాడు? తన గురించి, తను

వచ్చిన కార్యం గురించి తెలిసిపోయిందా? తెలిస్తే ఎలా తెలిసింది? ఎవరు తెలిపి వుంటారు?

తన కారుని అక్కడే లాక్ చేసి, రోడ్ దాటి రెండు మూడు సందులు దాటి నిర్జనంగా కనబడుతున్న ఒక ఇంటి ముందాగాడు.

తలుపు తాళంవేసి లేదు. ఎవరూ చూడటంలేదని గమనించి, తలుపుతట్టాడు.

"ఎవరు?" అంటూ పళనిస్వామి గొంతు విన్పించింది. లోనికి వెళ్ళాడు మనోహర్.

లోపల పళనిస్వామి ముందు టీపాయ్ వుంది. దాని మీద సిగరెట్ పేకలు, ఖాళీగ్లాసు, ఖాళీ అయిన బ్రాందీ బాటిల్ ఒకటి కనిపిస్తున్నాయి. పళనిస్వామి కళ్ళు మత్తులో తూలుతున్నాయి.

"నా పేరు మనోహర్! పరమశివన్ పంపించాడు" అంటూ అతని ఎదురుగా కూర్చున్నాడు మనోహర్. బ్రాందీ వాసన ముక్కుల్ని బద్దలు కొడుతుంది. భరించాడు మనోహర్.

"పరమశివనా? వాడెవడు? నాకు బ్రాందీ బుడ్లు పంపాడా?" అస్పష్టంగా గొణిగాడు పళనిస్వామి.

అతను మత్తులో తేలుతున్నాడని అర్థం అవుతోంది. ఈ సమయంలోనే తనకు కావలసిన వివరాలు రాబట్టుకోవటం తేలికే.

"లేదు. నిన్ను వాడు పంపలేదు. ఆ రాక్షసి పంపి వుంటుంది. దాన్ని బెదిరించానని దాని భయం. నో... యూ గెటౌట్" అరుస్తున్నాడు పళనిస్వామి.

"లేదు. నీకు బ్రాందీ బుడ్లు పంపింది" అన్నాడు మనోహర్. "ఏదీ? నిజంగా?" కళ్ళెత్తి చూశాడు. ఎర్రగా

మండుతున్నాయవి.

"తొందరపడకు. నాకు వివరాలు చెబితే నీకు బ్రాందీ బాటిల్స్ నేను కొనిస్తాను." అన్నాడు మనోహర్.

"అడగండి. తొందరగా!" ఆత్రుతగా అన్నాడు పళనిస్వామి.

"పరమశివన్ కొడుకు తంగరాజుని చివరిసారిగా నువ్వెప్పుడు చూశావ్?" అని ప్రశ్నించాడు మనోహర్.

"తంగరాజా? వారంరోజుల క్రితం రజీనాతో చూశాను ఓ బార్‌లో."

"రజీనాకి, తంగరాజుకి మంచి దోస్తీ వుందా?"

"ఏమో! ఇద్దరూ అప్పుడప్పుడు కలుసుకునేవాళ్ళు. తంగరాజుకి మరో దోస్తీ వుంది. యమాగ వుంటుందిలే ఆ పిల్ల!" నవ్వాడు పళనిస్వామి.

"ఆ అమ్మాయి ఎక్కడుంటుంది?"

"చెప్పను. బ్రాందీ బాటిల్ యిస్తేగాని చెప్పను."

"ఇస్తానన్నాగా! చెప్పు!" బ్రతిమాలినట్లు అన్నాడు మనోహర్.

"అయితే పద. నేనే ఆ పిల్ల దగ్గిర్కి తీసుకుపోతాను", అని లేవబోయాడు పళనిస్వామి. మనోహర్ అతనికి సహాయం చేయబోతే ఒద్దన్నాడు.

అతన్ని కారులో కూలేసి, అతను చెప్పిన డైరక్షన్స్ ప్రకారం కారుని పోనివ్వసాగాడు మనోహర్.

సిటీ చివర్లో వున్న ఒక సందుముందు ఆపాడు కారుని. ఇద్దరు కారుదిగి, లాక్ చేసి, సందులోకి నడిచారు. కొంచం దూరం పోగానే ఒక బార్ కన్పించింది.

చాలా చీప్ బార్ అది. లోపల కార్మికులు, అలగా జనం తింటూ తాగుతూ కన్పించారు. సిగరెట్ల పొగ బార్

అంతా అలుముకొని వుంది. తంగరాజువంటి ధనికుడు ఇటువంటి బార్ కి ఎలా వచ్చాడా అని ఆశ్చర్యపోయాడు మనోహర్.

"తంగరాజు స్నేహితురాలు ఇక్కడుందా?" అని అడిగాడు.

"ముందు ముందు" అన్నాడు పళనిస్వామి, స్టూల్ మీద కూలబడి.

ఒక బ్రాందీ బాటిల్ యిప్పించాడు మనోహర్.

దాన్ని సగంతాగి, బార్ నంతా కలయచూసి "అదుగో! ఆ చివర ఒంటరిగా వుంది చూడు. ఆ పిల్లే తంగరాజు ఫ్రెండ్." అన్నాడు అతను.

ఆమెని చూసి "ఆమేనా? పొరపాటు పడటం లేదుగా?" అన్నాడు అతనున్న పరిస్థితి తెలుసుకుంటూ.

"నాన్సెన్స్! నేను తాగినా మతి కోల్పోలేదు. నిస్సందేహంగా ఆమే. మరో బాటిల్" అన్నాడు పళనిస్వామి.

ఆమె వంక నడిచాడు మనోహర్.

7

ఆమెకి ఇరవై ఎనిమిదేళ్ళుంటాయి. సన్నగా, పొడుగ్గా వుంది. భుజాలవరకు కత్తిరించుకున్న జుట్టు. పల్చటి ఎర్రటి పెదిమలు. నాజూకైన శరీరం. ఛామనఛాయ.

ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లుంది ఆమె వాలకం.

ఆమె ఎదురుగా ఖాళీగావున్న కుర్చీలో కూర్చున్నాడు మనోహర్.

"మేడమ్! మీతో కొంచం మాట్లాడాలి!" అన్నాడు.

అతనివంక ఆశ్చర్యంగా చూసిందామె.

"మీరెవరో నాకు తెలీదు, నాతో ఏం పని?" అని

అడిగింది.

"తంగరాజు గురించి మీతో మాట్లాడాలి. అతని తండ్రి తరపున వచ్చాను."

"తంగరాజా? అతనెవరు?" అంది ఆశ్చర్యంగా.

సూటిగా చూశాడు మనోహర్. "మేడమ్, సరిగ్గా గుర్తుకుతెచ్చుకోండి. తంగరాజు మీ బాయ్‌ఫ్రెండ్. మీ ఇద్దరిని చూసినవాళ్ళున్నారు."

"మిస్టర్! మీరు పొరపాటుబడుతున్నారు. నాకా తంగరాజెవరో, నాకెలా బాయ్‌ఫ్రెండో తెలీదు. వస్తా" అంటూ లేచి చరచర గుమ్మంవేపు నడిచిందామె.

మనోహర్ దిగ్భ్రాంతుడయ్యాడు. ఆమె అబద్ధం చెబుతుందా? లేక తాగిన మత్తులో పళనిస్వామి పొరబాటు చెప్పాడా?

చటుక్కున స్వామి దగ్గరకు పోయాడు. "పళనిస్వామి! ఆ అమ్మాయే ఈ అమ్మాయా?" అన్నాడు కుదుపుతూ.

"అవును బ్రదర్! ఏమంది?" అన్నాడు పళనిస్వామి.

అతన్ని వదిలి బయటకు పరుగెత్తాడు మనోహర్. దూరంగా నిర్జనమయిన రోడ్ మీద నడుచుకుంటూపోతూ కన్పించిందామె.

ఆమెవైపు నడవబోయేంతలో భుజంమీద చేయేసి ఆపారెవరో. వెనుదిరిగి చూశాడు మనోహర్. కండలు తిరిగిన వస్తాదులాంటి మనిషొకడు కన్పించాడు.

"చూడు బ్రదర్! ఆమె కావాలంటే దొరకదు. ఇంకొకరికి ఎలాట్ చేయబడింది. నీక్కావాలంటే వేరే పిల్ల వుంది పద." అన్నాడు శాంతంగా.

అతని ఉద్దేశ్యం అర్థం అయింది.

"సారీ! అందుకా్కాదు. ఆమె చేతి రుమాలు మరిచి పోయింది. యివ్వటానికి పిలుస్తున్నాను" అంటూ అతని పట్టు విడిపించుకుని, ఆమె వైపు గబగబ అడుగులు వేశాడు మనోహర్.

శబ్దం విని తిరిగి చూసిందామె.

"చూడు మిస్టర్! ఇంతవరకూ మర్యాద ఇచ్చాను. ఇంకా అల్లరిచేస్తే బాగుండదు. నాకు తంగరాజెవరో తెలియదు. నన్ను వదిలెయ్!" అంది ఆమె.

మనోహర్ జేబులోనుంచి తంగరాజు ఫోటో తీసి చూపించాడు. అది చూడగానే ఆమె భృకుటి ముడిపడింది.

"మీరు పోలీసుల మనిషి కాదా?" అని అడిగిందామె.

"కాదు. నా పేరు మనోహర్. తంగరాజు తండ్రి పరమశివన్ తన కొడుకు కన్పించటం లేదని, పరిశీలించమని అడిగితే యిలా వచ్చాను," అని తన గురించి వివరంగా చెప్పాడు మనోహర్.

"ఇతని పేరు తంగరాజని నిజంగా నాకు తెలియదు. గోపాల్ అని చెప్పాడు." అంది ఆమె.

తంగరాజు మారుపేరుతో విప్లవముఠాలో చేరి వుంటాడని వూహించాడు మనోహర్.

"ఈ తంగరాజే గోపాల్. అతన్ని చివరిసారిగా ఎప్పుడు చూశారు? విప్లవ ముఠాలో అతనికి పరిచయం వున్న సంగతి మీకు తెలుసా?" అని ప్రశ్నించాడు మనోహర్.

"ఇక్కడ కాదు. అక్కడ నా కారుంది. రండి" అంటూ సందుదాటి, దూరంగా పార్కింగ్ చేయబడ్డ ఒక కారువంక దారితీసిందా యువతి.

"నా పేరు ఫ్రాన్సిస్ లోనీ. గోపాల్‌తో పరిచయం

ఆయాక అతని భావాలు గమనించి అతన్ని నేనే విప్లవ ముఠాలో చేర్పించాను" అని చెప్పిందామె.

"మీరా? అంటే..." అన్నాడు ఆశ్చర్యపోతూ.

"అవును. నేనూ విప్లవదళంలోని సభ్యురాలినే. విప్లవ దళంలోనికి సభ్యులను చేర్చటం నా పని. తిరుగుబాటు జరిపి చుంగ్ మిన్‌ను దించటం మా లక్ష్యం. అందుకు ఏమయినా చేస్తాం!" అంది జానీ ఆవేశంగా.

"విప్లవ దళం ఎవరు స్థాపించారు ఎందుకు?"

"అంటే..."

"మరేం లేదు. ఇందులో మరో దేశం ప్రమేయ మేమయినా వుందా? లేక మీ అంతట మీరే స్థాపించు కున్నారా? అని..."

"చుంగ్ మిన్ అధికారంలోకి రాకపూర్వం 'మోజంగ్' అనే వ్యక్తి అధికారంలో వుండేవాడు. అతనిదగ్గర ఉండే 'రచాయ్' అనే మంత్రి కొడుకే విప్లవనాయకుడు 'జార్మన్' మరో అధికారి కూతురిని నేను.

చుంగ్ మిన్ అధికారంలోకి వచ్చాక మాజీ ప్రభుత్వం లోని ముఖ్యమయిన అధికారులని, మంత్రులని నిర్దాక్షి ణ్యంగా చంపించాడు. ఆ దాడిలో మా తల్లిదండ్రులు కూడా హతమయ్యారు.

అప్పుడే జార్మన్ శపథం పట్టాడు. ఏనాటికయినా చుంగ్ మిన్‌ని చంపి, అధికారం హస్తగతం చేసుకో వాలని నిర్ణయించుకున్నాడు. పగ, ప్రతీకారంతో జ్వలించి పోతున్న కొందరిని కూడగట్టుకుని కొండలలోకి పారి పోయాడు. మేమంతా అతనికి బాసటగా నిలిచాము.

చుంగ్ మిన్ జార్మన్ని, అతని ముఠాని నాశనంచేయా లని అనేక విధాలుగా ప్రయత్నించాడు. కాని అతని

ప్రయత్నాలు ఫలించలేదు. దాదాపు రెండువేలమంది యువకులు, యువతులు మా దళంలో చేరారు. వారికి షూటింగ్, సైఫింగ్ వంటి విద్యలు జార్మన్ స్వయంగా నేర్పేవాడు.

త్వరలోనే అధికారాన్ని హస్తగతం చేసుకుంటాం. చుంగ్ మిన్ మరణించిన మరుక్షణమే దేశప్రజల్ని ఉద్దేశించి జార్మన్ ప్రసంగించటం కళ్ళారా చూస్తాను. అప్పుడుగాని నాకు తృప్తి లేదు.''

ఆవేశంగా పలుకుతున్న ఆమె మాటలను వింటున్నాడు మనోహర్. యితరులు వారిని గమనించటం లేదు...

''తరువాత గోపాల్... అదే తంగరాజుని పెళ్ళాడతావా?'' అని అడిగాడు మనోహర్, అంతా విని.

''లేదు. వేరొకరితో నా వివాహం నిశ్చయమై పోయింది.''

''ఎవరితో?''

''విప్లవదళ నాయకుడు జార్మన్‌తో.''

నిముషంపాటు నిశ్శబ్దం ఆవరించింది వారిద్దరిమధ్య. మనోహర్ మెదడులో అనేక ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

''మిస్ జోసీ! నేను మీ నాయకుణ్ని వెంటనే కలుసుకోవాలి. అతనితో ఒక విషయం మాట్లాడాలి''అన్నాడు మనోహర్.

ఆశ్చర్యపోయింది జోసీ. ''ఏమిటది?''

''ఇంతకాలమూ ఎవరి అండదండలు లేకుండా మీరు మీ సంస్థని స్థాపించి, పోషించుకోగలిగారు. మీకు రష్యా సహాయం చేస్తుందన్న రూమర్స్ వ్యాపిం

చాయి."

"అబద్ధం" అంది జోనీ.

"రైట్. కాని 'కైనా' దేశం మీ దళాన్ని వశ పరుచుకుని, తద్వారా స్విట్ లాండ్ ని హస్తగతం చేసు కోవాలని చూస్తుంది. ఇదీ నా అనుమానం" అన్నాడు మనోహర్. కైనా గూఢచారి స్విట్ లాండ్ రావటానికి అదే కారణం అని అతనిప్పుడు నమ్ముతున్నాడు.

"మీకెలా తెలుసు...?" అంది ఆశ్చర్యపడుతూ జోనీ.

తెల్లబోయాడు మనోహర్. "అంటే... నే నన్నది నిజమేనా?"

దీర్ఘంగా నిశ్వసించింది జోనీ. "నిజమే. మాకు సభ్యు లున్నారు, యుక్తులున్నాయి. కాని డబ్బులేదు, శక్తి లేదు. మాకు కావలసిన ఆయుధాలు లేవు. కొనడానికి డబ్బూ లేదు.

ఆ సమయంలోనే తంగరాజు...అదే గోపాల్ పరి చయం అయింది. డబ్బుకేమీ కొదవలేదని, ఆయుధాలను తీసుకొంటానని చెప్పాడు అతను. అలాగే డబ్బు ఇచ్చాడు కూడా. అయితే వాటిని రహస్యంగా ఇక్కడికి చేర్చటం మాకు సమస్య అయింది. అదికూడా అతనే పరిష్కరిం చాడు అతని ఫ్రెండ్స్ ద్వారా!"

"ఎవరతను?" కుతూహలంగా అడిగాడు.

"మగవాడు కాడు. ఆడమనిషి. పేరు రజీనా. మిస్ రజీనా."

ఉలిక్కిపడ్డాడు మనోహర్.

"ఆమెకూడా మా సంస్థలో చేరింది. వాళ్ళ ఫ్యాక్టరీకి దేశదేశాలనుండి ఆర్డర్స్ వస్తాయి. అలా వచ్చేటప్పుడే

షిప్స్‌ద్వారా ఆయుధాలు సరఫరా చేసేది మాకు. వాటి మీద 'కైనా' 'పాకిస్థాన్' ముద్రలుండేవి. అవి ఏ దేశానివి అన్న సంగతి అనవసరం.

ఆమె మరోసారికూడా మమ్మల్ని రక్షించింది. రజీనాకి ప్రభుత్వంలో పలుకుబడి వుంది. ఒకరోజు వచ్చి స్వీట్ లాండ్‌లోని కైనా ఏజంట్ల లిస్టును స్వీట్‌లాండ్ పోలీసులు తయారుచేశారని, ఎంత ప్రయత్నించినా అది లభ్యం కాలేదని చెప్పింది. ఆమె సలహామీదే మా దళం మిలిటరీ కాంప్‌మీద దాడిచేసి ఆ లిస్టుని చేజిక్కించుకుంది.

ఆ లిస్టుద్వారా అనేకమంది కైనా ఏజంట్లు బయటపడ్డారు. అందులో చాలామంది మా దళంలోని సభ్యులే. జార్మన్‌కి కుడిభుజంగా నిలిచినవారే. వారిని బంధించాము. రజీనానే లేకపోతే మేమీపాటికి 'కైనా' వశం అయివుండేవాళ్ళం!"

"ఆ మిలిటరీ కాంప్‌మీద జరిగిన దాడిలో తంగరాజు పాల్గొన్నాడా?"

"లేదు. దాడి జరగకముందే రజీనా ఒక ముఖ్యమయిన పనిమీద అతన్ని పంపింది. కైనాకి సంబంధించిన ఒక ముఖ్యమయిన ఏజంటు మారుపేరుతో వుంటున్నాడని తెలిపి, ఆ ఏజంటుని అంతం చేసే బాధ్యత తంగరాజుకి అప్పగించింది."

"ఆ ఏజెంటుని తంగరాజు చంపాడా? ఆ ఏజెంటెవరు?"

"ఆ ఏజంటు పేరు షూమింగ్. మారువేషంలో ఒక రిజెర్వ్‌షిప్‌లో వుంటున్నాడు. తంగరాజుకూడా మారు

పేరుతో చేర అతన్ని అంతం చేశాడు," చెప్పింది జోనీ.

"మారు పేరా? ఏమిటది?" ఆత్రుతగా అడిగాడు మనోహర్.

"రామన్" క్లుప్తంగా అంది. స్టన్ అయిపోయాడు అతను.

8

చాలాసేపటివరకు ఆ షాక్‌లోనుంచి తేరుకోలేక పోయాడు మనోహర్. బుర్రంతా ఖాళీ అయినట్లయింది. జోనీ చెబుతుంది నిజమా, అబద్ధమా అన్న సందేహం కూడా రాకపోలేదు.

"మిలిటరీ కాంపులో దొంగిలించిన ఆ ఏజంట్ల లిస్టు కాపీ మీ దగ్గరుందా?" అన్నాడు మనోహర్.

"ఉంది" అంటూ హేండుబాగ్‌లోనుంచి కాయితాలు తీసి యిచ్చింది.

దాదాపు రెండువందల పేర్లున్నాయి. వారి వివరాలు, అడ్రసులు కూడా టైప్ చేయబడి వున్నాయి నీట్‌గా.

"థాంక్స్! వీటిని తరువాత ఇస్తాను" అన్నాడు.

"అక్కర్లేదు. కావాలంటే మీరే ఉంచుకోండి. మీ దేశానికేమన్నా ఉపయోగపడుతుందేమో!" అంది జోనీ.

"సరే! తరువాత జార్మన్‌ని కలుసుకుంటాను. మీరెళ్ళిపోండి" అంటూ కారు దిగాడు మనోహర్.

"మిస్టర్ మనోహర్! మిమ్మల్ని చూసి పోలీసుల మని పని కఠినంగా ప్రవర్తించినందుకు క్షమించండి" అంది కారు స్టార్టు చేస్తూ.

"నెవర్ మైండ్! రజీనా కూడా అలాగే అనుకొని ఉంటుంది."

"మీ విషయం వెంటనే ఆమెకి చెబుతాను" అని కారుని పోనిచ్చింది ఆమె.

లిస్టువంక ఒకసారిచూసి ఏదో నిశ్చయానికి వచ్చాడు. పళనిస్వామి ఎటూ తను వచ్చేవరకు అక్కడే వుంటాడు. అతనితో చెప్పే అవసరం లేదనుకొని, మరో నాలు గయిదు గొందులు తిరిగి ఒక భవంతిలోనికి ప్రవేశించాడు.

లోపల ఉన్న మనిషికి భారత ప్రభుత్వం తనకి యిచ్చిన అధికారపత్రం చూపించి, "సర్! ఈ లిస్ట్ని వైర్ లెస్లో వెంటనే సిబిఐ హెడ్ క్వార్టర్స్కి పంపి చెక్ చేయమనండి. నిజమో అబద్ధమో తెలిస్తే చాలు. ఎంత త్వరగా సమాధానంవస్తే అంత మంచిది"అన్నాడు ఇండియా ఎంబసీలోని ఆ అధికారితో.

"రేపు ఉదయానికల్లా జవాబు రెడీగా వుంటుంది. మీకు ఎప్పుడు ఫోన్ చేయమంటారు?"

"వద్దు. నేనే వీలయినప్పుడు ఫోన్ చేస్తాను. పది గంటల ప్రాంతంలో వెయిట్ చేయండి" అని చెప్పి బయటపడ్డాడు.

అతనికి చాలా సందేహాలు కలుగుతున్నాయి. మిస్ రజీనా కూడా విప్లవ ముఠా సభ్యురాలే కావటంతో తనను మానించినట్లుగాక, వేరెవరో తనని దీవినుంచి వెళ్ళ గొట్టించటానికి ప్రయత్నిస్తున్నారు. వాళ్ళెవరు? తను పరిశోధన మానుకుంటే వాళ్ళకేమిటి ఉపయోగం?

అలా ఆలోచిస్తుండగానే వెనకనుంచి వచ్చి ఆగింది పోలీసుకారు. కమీషనర్ జోరోచ్ దిగాడు.

"మిస్టర్ మనోహర్! మీ గురించి సిటీ అంతా గాలిస్తున్నాం! ఇలా రండి" అంటూ కారెక్కించుకున్నాడతన్ని.

బార్ దగ్గరలో వదిలిన మనోహర్ కారుదగ్గరికి తీసుకుపోయి "చూడండి" అన్నాడు.

అదిరిపడ్డాడు మనోహర్. వెనక సీటులో పళనిస్వామి అనుకొని ఉన్నాడు. అతని గుండెల్లో పిడి కనబడుతోంది.

"ఇతన్ని హత్య చేసినందుకు మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం!" అన్నాడు జోరోచ్.

9

దేశంకాని దేశంలో చేయని నేరానికి యిలా బంధిఖానాలో పడతానని చివరి క్షణంవరకూ ఊహించలేకపోయాడు మనోహర్.

అప్పటికి ఉదయం ఆరుగంటలు దాటింది.

రాత్రంతా సెల్ లోనే గడిపాడు అతను. సిగిరెట్ కాలుస్తూ తాను వెలెండ్ లోకి అడుగుపెట్టిన దగ్గరనుంచి సంభవించిన సంఘటనలు గుర్తుకు తెచ్చుకుంటూ, ఏదో వూహించటానికి రాత్రంతా ప్రయత్నిస్తుండిపోయాడు. తనని ఎవరయితే అడ్డు తొలగించుకోగోరుతున్నారో, వాళ్ళే ఈ హత్యానేరాన్ని తనపై మోపి ఉంటారని భావించాడతను.

ఏడుగంటలవుతుండగా జోరోచ్ వచ్చి తలుపులు తెరిపించి, "మిస్టర్ మనోహర్! మీకు జామీను ఇవ్వబడింది. మీరిక వెళ్ళవచ్చు" అన్నాడు.

తనకి జామీను యిచ్చేదెవరా అని ఆశ్చర్యపోయాడు మనోహర్. టోనీనా?

"ఎవరిచ్చారు?" అన్న అతని ప్రశ్నకు సమాధానం యివ్వటానికి నిరాకరించి "బయటికి వెళ్ళండి. మీకే తెలుస్తుంది" అన్నాడు జోగ్రోచ్.

బయట తెల్లటి కారు ఆగి కన్పించింది మనోహర్ కి.

"కమిన్ మిస్టర్ మనోహర్!" అంటూ ఆహ్వానించింది మిస్ రజీనా.

"మీరా?" అన్నాడు తెల్లబోయి.

"క్షమించండి మనోహర్! మీరు పరమశివన్ గారి తరఫున వచ్చారని తెలిస్తే యింత హడావిడి జరగక పోను. మీ రెవరో పోలీసుల మనిషని అపోహపడ్డాను. జోనీ వచ్చి చెప్పేదాక నాకు తెలియదు. పదండి. తంగ రాజు దగ్గరికి వెళదాం" అంది రజీనా.

తెల్లబోయి "అతనెక్కడుంటాడో మీకు తెలుసుగా?" అని ప్రశ్నించాడు.

"తెలుసు" అన్నట్లు తలూపింది. "కంపానగరం ఉత్తరదిక్కు కొండల్లో విప్లవదళాలు నివాసం చేస్తున్నాయ్. అక్కడికి చేరుకున్నాడతను. ముందు మా ఫ్యాక్టరీకి వెళ్ళి, అక్కడ్నించి తంగరాజు దగ్గరకు వెళ్దాం" అంది.

"ఐ. సీ." అన్నాడు. మనోహర్ కారెక్కిన తరువాత కారు కదిలింది.

పావుగంట అనంతరం నగరాన్ని విడిచి, మరికొంత దూరం పోయి, ఎడమప్రక్కకు తిరిగింది కారు. మెత్తటి ఎర్రటి మట్టిరోడ్ ని పట్టి, దుమ్ము రేపుతూ సాగిపోయింది. పావుగంట తరువాత ఒక ఫెన్సింగ్ లోనికి తిరిగింది కారు. దూరంగా ఏవో ఫ్యాక్టరీ షెడ్స్ కనబడుతున్నాయి.

"ఇది మా ఫ్యాక్టరీ. యిక్కడ కొంచం పనివుంద

నావు. అది పూర్తయ్యాక తంగరాజు దగ్గరకు వెళదాం. ఈలోపుగా మీ పనులు కానివ్వండి. రాత్రి భోజనంకూడా లేదు కాబోలు." అంటూ ఒక మూలగా నున్న భవంతి ముందు కారాపింది రజీనా.

లోపలినుంచి పదహారేండ్ల బాలిక పరుగెత్తుకొచ్చింది.

"రూమా! వీరికేం కావాలో చూడు." అని ఆ పిల్లకు పురమాయించి, "ఇరవై నిముషాల్లో వస్తాను మనోహర్" అంటూ కారులో వెళ్ళిపోయింది మిస్ రజీనా.

మనోహర్ లోనికి నడిచి తన పనులు పూర్తి చేసు కున్నాడు. స్నానాదికాలు ముగించి, టిఫిన్ దట్టంగా పట్టిస్తుండగా చటుక్కున అతనికి గుర్తుకొచ్చింది.

వెంటనే రజీనా ప్రయివేటు గదిలో వున్న టెలిఫోన్ ఎత్తి డయల్ చేశాడు.

"మనోహర్‌ని మాట్లాడుతున్నాను. నెగిటివా? పాజిటివా?" అని అడిగాడు.

"కంప్లీట్ నెగటివ్" అంటూ సమాధానం ఇచ్చాడు ఎంబసీ అధికారి.

ఫోన్ పెట్టేసి ఆలోచనలో పడ్డాడు మనోహర్. చైనా ఏజంట్ల లిస్ట్ అని స్వీట్ లాండ్ పోలీసులు తయారు చేసింది అబద్ధపులిస్టు. అందులో కొంతమంది యిదివరకు భారతదేశంలో గూఢచారి చర్యలు జరిపినవారే. కాని వారు, వీరు ఒకరు గాదని వార్త తెలిసింది. ఆ అబద్ధపు పేర్లనే నిజమైన లిస్టని నమ్ముతున్నారు విప్లవకారులు. ఎవరిది పొరబాటు? పోలీసులదేనా?

అదే క్షణంలో గుమ్మం దగ్గర అలికిడయి తల తిప్పి చూశాడు.

రజీనా "వెళ్దామా?" అంది.

“వెళ్దాంగాని మిస్ రజీనా...ముందు నాకో సంగతి చెప్పు. నువ్వు కైనా ఏజంటుగా ఎప్పుడు చేరావ్?” సూటిగా ప్రశ్నించాడు మనోహర్.

భయంకరమైన నిశ్శబ్దం అలుముకుంది గదిలో.

10

“వాట్ డు యూ మీన్?” కోపంగా అంది మిస్ రజీనా.

“యస్ రజీనా. నువ్వు కైనా తరఫున పనిచేస్తున్నావని నాకు తెలుసు. నిజం చెప్పు!” అన్నాడు మనోహర్.

“షటప్! నీకు మతి పోలేదుగదా? ఏం మాట్లాడుతున్నావో తెలుసా?”

“తెలుసు. విప్లవ దళాలకు కైనా ఏజంట్ల లిస్టు అని చెప్పి వాళ్ళకి దొరికింపచేసిన లిస్టు మొత్తం అబద్ధం. మీరే ఆ లిస్టుని తయారుచేసి వుండాలి. పాపం జార్మన్ దానిని నమ్మి తన విశ్వాసపాత్రుల్ని తానే బంధించాడు. దానికి కారణం నువ్వు, నీ అనుచరులు. అసలు లిస్టేమయిందో నీకు తెలిసి వుండాలి. అంటే నువ్వు కైనా ఏజంటు ‘చాయింగ్’ మనిషై వుండాలి. అతను మరణించటంతో నువ్వే ఆర్డర్స్ పాస్ చేస్తూ, అతను బ్రతికున్నట్లే నా అనుచరులను నమ్మిస్తున్నావ్.”

“నో! అబద్ధం. అంతా అబద్ధం!” అరిచింది రజీనా.

“ఏది అబద్ధం? నేను మీ పనులకు అడ్డం వస్తున్నానని భావించి, ఏనాటికయినా నిజం తెలుసుకోగలనని గ్రహించి, మీ దారినుంచి నన్ను తప్పించ చూశావ్. పళనిస్వామి హత్య చేయించి అది నామీద మోపావ్.

అయితే ఈలోగా జోనీ నిన్ను కలుసుకుంది. దానితో నాకు చాలా వివరాలు తెలుసునని, వాటి నెక్కడ

పోలీసులకు చెబుతానోనని భయపడి ఏమీ ఎరగనట్లే విడిపించావ్.

బహుశా నకిలీ లిస్టుని చూసిన తంగరాజుని చంపినట్లు నన్నూ రహస్యంగా అంతం చేయాలని చూశావ్!" తాపీగా అన్నాడు.

అదిరిపడింది మిస్ రజీనా. "తంగరాజుని చంపేనా? నీకెలా తెలుసు?"

"జరిగిన ఫాక్ట్సనిబట్టి గెస్ చేశాను."

"మైగాడ్! మిస్టర్ మనోహర్. నేననుకున్న దాని కంటే ప్రమాదకారివి నువ్వు. నిన్ను బ్రతికుండనీయటం చాలా ప్రమాదం" అని చటుక్కున హేండ్ బాగ్ లో నుంచి చిన్న పిస్టలు తీసింది.

ఆమె అంత క్విక్ గా ప్రవర్తిస్తుందని వూహించలేక పోయాడు మనోహర్.

"మిస్టర్ మనోహర్! నువ్వన్నట్లు నేను క్రైనా ఏజంటునే. ఆ వివరాలు తెలిసినవాళ్లు బ్రతకకూడదు." అంటూ ట్రిగ్గర్ నొక్కబోయింది.

అదే సెకనులో 'ధన్' మన్న చప్పుడయింది.

మూలుగుతూ కుప్పలా కూలిపోయింది మిస్ రజీనా. ఆమె వీపునుంచి రక్తం వెల్లువలా ప్రవహించ మొదలు పెట్టింది.

తెల్లబోయి అటు యిటూ చూశాడు మనోహర్.

బయట వరండా చివరనుంచి పొగలు కక్కుతున్న పిస్టలుతో ప్రత్యక్షమయ్యాడు కమీషనర్ జోరోచ్.

"సారీ ఫ్రెండ్! రజీనా క్రైనా ఏజంటని యిప్పటి వరకు నాకు తెలియదు. తెలియగానే..."

"మీరిక్కడకు ఎలా వచ్చారు?" ప్రశ్నించాడు

మనోహర్.

"నిన్న హత్యాస్థలంలో జరిగిన పరిశోధనలో మిస్ రజీనా ఈ హత్యని చేసినట్లు సాక్ష్యం దొరికింది. దానిని గురించి వివరాలడుగుదామని వస్తే గుమ్మంలో నిలుచుని నిన్ను బెదిరిస్తూ కనిపించింది. అంతే! వెంటనే కాల్చేశాను. కాని ఈమెకైనా ఏజంటంటే...ప్చ్. ఐ కాంట్ బిలీవ్!" అన్నాడు జోరోచ్.

"వీళ్ళ లీడర్ గురించి తెలుసుకోవాలంటే మరో చోటికి వెళ్ళాలి మనం," అన్నాడు మనోహర్.

"ఎక్కడికి?"

"చెబుతాను. పదండి," అంటూ దారి తీశాడు మనోహర్.

రెండు నిమిషాల తరువాత పోలీసు కారు కదిలింది.

11

"స్కాట్‌లాండ్ మెరైన్ రీసెర్చ్ అకాడెమి" అన్న అక్షరాలు మెరుస్తున్నాయి, నీటిమీద ప్రతిఫలించిన కాంతిలో.

మధ్యాహ్నం పన్నెండు గంటల ప్రాంతంలో తమని సమీపిస్తున్న ఒక బోట్‌ని గమనించి "ఛీఫ్! ఎవరో వస్తున్నారు" అని రిపోర్ట్ చేశాడొక వ్యక్తి.

డెక్‌మీద నిలబెట్టి ఉంచబడిన బాతీస్పియర్ బయటి నుంచి పరిశీలిస్తున్న ప్రొఫెసర్ కర్టిస్ కళ్ళు చిట్లించుకొని చూశాడు.

మనోహర్, పోలీసు కమీషనర్ జోరోచ్.

డెక్‌మీదకు వచ్చారిద్దరు అయిదు నిమిషాల తరువాత.

"సారీ ప్రొఫెసర్! మరలా మీకు శ్రమ కల్గించక

తప్పలేదు'' అన్నాడు మనోహర్.

''బాతీస్ఫియర్‌ని జస్ట్ ఉదయమే బయటికి తీశాము. ఆరిన తరువాత లోనికి పోదామనుకుంటుండగా మీరు వచ్చారు'' అంటూ తలుపు తెరిచి బాతీస్ఫియర్ లోనికి దారితీశాడు క్రిస్. జోరోచ్, మనోహర్‌లు కూడా లోనికి దూరారు

లోపల పచ్చని పాచివంటి పదార్థం పేరుకుపోయి వుంది. లోపల వున్న శవం భయంకరంగా వుంది. తల, మొండెం అంతా కొరుక్కు తిన్నాయి చేపలు. శవం అసలు ఆకారంలో లేదు. దుస్తులుకూడా చిరిగిపోయాయి. జేబుదగ్గరవున్న ప్లాస్టిక్ బాడ్జిమీద 'ఘూమింగ్' అన్న పేరు మాత్రం వుంది.

బాతీస్ఫియర్ అంతా పరిశీలించాడు మనోహర్. అతని దృష్టి లోపల వున్న ఒక పరికరంమీద పడింది. దానిని క్రిస్‌కు చూపి ఏదో అడిగాడు.

కావన్నట్లు తలవూపాడు క్రిస్, ఆశ్చర్యపోతూ.

జోరోచ్, క్రిస్‌లు యిద్దరు బయటికి నడవగానే, శవం జేబులు తడిమి, లోపలి దుస్తులలో వున్న ఒక కాగితాల బొత్తిని జేబులో వుంచుకున్నాడు మనోహర్.

''ప్రొఫెసర్! ఆ మరణించిన మనిషి! 'ఘూమింగ్' కాదు. 'రామన్' '' అన్నాడు మనోహర్ బయటికివచ్చి.

''వాట్? వాట్ ఆర్ యు టాకింగ్?'' ఉలిక్కిపడ్డాడు క్రిస్.

''యస్ ప్రొఫెసర్. మీకు మొదటినుంచి చెబితేగాని అర్థంగాదు'' అంటూ చాయింగ్, రజీనా, తంగరాజుల గురించి చెప్పాడు.

''స్వీట్‌లాండ్‌ని వశపరుచుకో చూస్తున్న విప్లవ

దళాలను హస్తగతం చేసుకొని, తద్వారా ఈ దేశాన్ని ఆక్రమించుకోవాలని కైనా వాంఛిస్తోంది. అందుకని కైనా గూఢచారి 'చాయింగ్'ని పంపింది. అతడు 'షూమింగ్' అన్న మారుపేరుతో మీ దగ్గర చేరాడు.

అయితే ఈ లోపు మరో సంఘటన జరిగింది. స్కాట్‌లాండ్ పోలీసులు ఎంతో కష్టపడి, ఐలెండ్‌లో వున్న కైనా ఏజంట్ల వివరాలు తయారు చేశారు. ప్రభుత్వంలో పలుకుబడివున్న కైనా ఏజంటు ఒకరు ఆ విషయం కనుక్కొని, అసలు లిస్టుని మాయంచేసి, దొంగలిస్టుని తయారు చేసి, ఆ లిస్టుకోసం మిలిటరీ కాంపుమీద దాడి జరపవలసిందిగా విప్లవ దళాలను ప్రోత్సహించారు.

జార్మన్ అలాగే చేసి ఆ దొంగలిస్టు ప్రకారం తన ముఖ్య అనుచరులను ఖైదులో వుంచాడు.

అయితే పోలీసులు తయారుచేసిన అసలు లిస్టు మాయం అయింది. ఈ విషయం తంగరాజు గ్రహించి, అతనే అసలు లిస్టు మాయం చేశాడు.

నిజమయిన లిస్టు గనక విప్లవ దళాలచేతిలో పడితే దళంలో పనిచేస్తున్న కైనా ఏజంట్ల వివరం తెలిసి తమ గుట్టు బయటపడుతుందని గ్రహించారు కైనా ఏజంట్ల నాయకులు. నిజమైన లిస్టుని పొందటానికి 'రామన్' అన్న పేరుతో వ్యవహరిస్తున్న తంగరాజుని హత్యచేయబూనారు.

తంగరాజుని హత్యచేసి ఆ లిస్టుకోసం వెదికాడు షూమింగ్ వేషంలోవున్న చాయింగ్. అయితే ఆ హడావిడిలో అది లభించలేదు. బాతీస్థియర్‌ని నాశనం చేస్తే లిస్టు, తంగరాజుకూడా మాయం అవుతారని ఊహించి అలాగే చేశాడు.

అయితే బాతీస్ఫియర్‌కి అతననుకున్నట్లుగా ఎక్కువ నష్టం జరగని సంగతి అతనికి తెలిసి వుండదు. అందుకనే నిజమయిన లిస్టు బయటపడింది.'' అంటూ జేబులోనుంచి కాగితాల బొత్తి తీశాడు మనోహర్.

బాగా తడిసిపోయినప్పటికీ, మైపుచేయబడిన ఆ కాగితాలు చదవటానికి వీలుగానే వున్నాయి.

''మరి... ఈ హత్య ఎలా జరిగింది? ఫ్లూమింగ్ ఎలా తప్పించుకున్నాడు?'' అడిగాడు ప్రొఫెసర్ కర్టిస్.

రెండు నిమిషాల పాటు ఏదో ఆలోచించి అన్నాడు మనోహర్.

''అదంతా పెద్ద నాటకం ప్రకారం జరిగింది. ఏడు వందల అడుగుల లోతులో బాతీస్ఫియర్ తలుపు తెరవటం సాధ్యంగాదని చెప్పారు మీరు. తెరిచినా మనిషి ఆ ప్రెషర్‌కి బ్రతకటం కష్టం. దానినిబట్టి ఆలోచిస్తే ఇలా జరిగి వుండొచ్చు.

బాతీస్ఫియర్‌ను నీటిలో దింపగానే, వెంటనే స్పీడ్‌గా మునగనీయకుండా క్రమంగా వేగం పెంచుకుంటూ దింపుతారని చెప్పారు. బాతీస్ఫియర్ దిగిన వెంటనే 'తంగరాజు'ని చంపి, ఫ్లూమింగ్ లిస్టుకోసం వెదికాడు. కాని కనిపించలేదు.

ఇంతలో బాతీస్ఫియర్ క్రిందకి యింకా దిగటంతో తలుపులు తెరుచుకుని వచ్చేశాడు ఫ్లూమింగ్. ఇదంతా అంత ఎక్కువ ప్రెషర్ వుండని యాభై అడుగుల లోతులోపే జరిగివుంటుంది.

అంతకు ముందే రికార్డు చేసివున్న వాటర్‌ప్రూఫ్ ఆటోమాటిక్ టేపురికార్డర్ ద్వారా 700 అడుగుల లోతులో ఏదో భయంకర దృశ్యాన్ని చూశానని మీ సిబ్బందిని

అయోమయంలో పెట్టి, ఎక్స్‌ప్లోజివ్స్ సహాయంతో బాతీస్థియర్‌కి, షిప్‌కి కనెక్షన్స్ కట్ చేశాడు. బాతీస్థియర్ అడుగుకి పోవటం మాని లిస్టు అంతం అయి నట్టే అని తలచి వెళ్ళిపోయాడు.''

ఆశ్చర్యంతో అందరి కళ్ళూ విప్పారాయి.

''మరి అసలు లిస్టుని ఎవరు మాయం చేశారు?''

''కైనా ఏజంట్లు దేశంలో నలుమూలలా విస్తరించి వున్నారు. వారందరిని గమనించి పోలీసులు తయారు చేసిన లిస్టు అది. అయితే పోలీసు అధికారులలో కూడా, ఒకడు కైనా ఏజంటు కావటంవల్ల, దానిని మాయంచేసి, దొంగ లిస్టు వుంచాడు. దానిని తంగరాజు సంగ్రహించాడు'' చెప్పాడు మనోహర్.

''ఇంతకీ అతనెవరు?'' అడిగాడు జోరోచ్.

''అతనా? ఈ వేషంలో పోలీసులో ప్రధానాధికారిగా బాధ్యతలున్న మనిషి. సెన్సార్‌షిప్ విధించి ఈ విషయాలు బయటకి రాకుండా చేస్తున్న వ్యక్తి. ఇంకెవరూ– నువ్వే!''

''నేనా?'' అదిరిపడ్డాడు జోరోచ్. ''నేనే కైనా ఏజంటయితే మిస్. రజీనాను ఎందుకు చంపుతాను?'' అన్నాడు పాలిపోయిన ముఖంతో.

''ఎందుకంటే రజీనా నీ బాస్. ఆమె వుండగా నీవామె స్థానంలోకి చేరుకోవాలంటే ఆమెను తొలగించక తప్పదు. దానిని నామీద మోపవచ్చనుకొని ఆమెని చంపావ్.''

చటుక్కున పిస్టలు తీశాడు జోరోచ్. ''నువ్వుచాలా తెలివయినవాడివి.'' పళ్ళుకొరుకుతూ అన్నాడు.

''యస్ మై ఫ్రెండ్! నేనీ దేశం వచ్చినపుడు బాతీ

సియిర్‌లో ఫలానావారు చనిపోయారంటూ పేర్లతో సహా నాకు చెప్పావ్, గుర్తుందా? సెన్సార్‌షిప్ అమలులో వుండి ఈ దేశీయులకయినా తెలియనివ్వని రహస్యాన్ని నా కెందుకు చెప్పావో తరువాత అర్థం అయింది. బహుశా నే నెవరో, ఎందుకు వచ్చానో నీవు గ్రహించి ఉంటావ్.

నా మాట ప్రకారం 'షూమింగ్' రూపంలో ఉన్న 'చాయింగ్' మరణించాడని నమ్మి వెళ్ళిపోతానని భావించావ్. కాని నేను పరిశోధనకి దిగటంతో కంగారుపడి ఈ ఐలెండ్ విడిచి వెళ్ళవలసిందిగా వత్తిడి చేశావు. నా పరిశోధనలో నీ విషయం బయటపడుతుందేమోనని భయపడ్డావు'' చెబుతున్నాడు మనోహర్.

''యూ బాస్టర్డ్'' ట్రిగ్గర్ నొక్కబోయాడు జోరోచ్.

అదే క్షణంలో 'సర్' మంటూ వచ్చి జోరోచ్ చేయి మీద తగిలి పిస్టల్ని యెగరగొట్టిందో ఇనుప వస్తువు.

జోరోచ్ మీదకు యెగిరిదూకాడు మనోహర్. పిడికిలి బిగించి అతని గడ్డంక్రింద కొట్టగానే, పళ్ళు కదిలి-నోట రక్తం అయింది.

అదే క్షణంలో ఎవరో క్రిందపడ్డ పిస్టల్ని తీసుకుని జోరోచ్‌ని కాల్చేశారు.

''థాంక్యూ వాయంగ్'' అన్నాడు ఇనుప వస్తువు విసిరిన వాయింగ్‌తో, మనోహర్.

''ఈ దేశంలో ఇంత గూడుపుఠాణీ జరుగుతుందా?'' అంటూ ఆశ్చర్యపోయాడు కర్టిస్.

మనోహర్ ఆయనతో చెప్పి బయలుదేరాడు.

తంగరాజు మరణించాడు. పరమశివన్ ఏమవుతాడు?

చాయింగ్ తప్పించుకోబోయాడు. ఈ సంగతి విప్లవ దళంకి తెలియచేయాలి. జార్మన్ కలుసుకోవాలి. అంటే ఫ్రాన్సిస్ జోనీని కలుసుకోవాలి. ఎలా?

దీవిని సమీపించి పోలీసుల కారు ఎక్కేసరికి దీవి లోపల ధన్, ధన్ మన్న కాల్పులారంభం అయ్యాయి. "విప్లవం రేగిందన్నమాట" అనుకున్నాడు.

12

ఈ హడావిడిలో ఫ్రాన్సిస్ జోనీ ఎక్కడ వుంటుంది? ఆమెని దొరకబుచ్చుకోవడం ఎలా? అనుకుంటూ కారులో బయలుదేరాడు మనోహర్.

చుంగ్ మిన్ ని చంపటం వారి ధ్యేయం గనుక అతని పాలెస్ లో ఉండొచ్చు ననుకుంటూ కారుని అటువైపు నడిపాడు.

హఠాత్తుగా ప్రారంభమయిన విప్లవానికి పోలీసులు, సైనికులు తట్టుకోలేకపోతున్నారనిపించింది మనోహర్ కి. అక్కడక్కడ గుట్టలుగా సైనికుల, పోలీసుల శవాలు పడివున్నాయ్.

చుంగ్ మిన్ పాలెస్ కి యెదురుగా ఒక సందుచాటున కారు ఆపి కాచుక్కూచున్నాడు మనోహర్.

పాలెస్ గేటునుంచి కొంతదూరంలో వుంది. లోపల సంకుల సమరం జరుగుతున్నట్టుగా కాల్పులు వినబడుతున్నాయి.

పావుగంట అనంతరం పాలెస్ నుంచి ఒక కారు గేటు వైపుగా దూసుకురావటం కన్పించింది మనోహర్ కి. చుంగ్ మిన్! అతను పారిపోతున్నాడు కాబోలు.

అయితే చుంగ్ మిన్ కారు గేటు బయటకు వచ్చేరాక ముందే దానిమీద మెషిన్ గన్ ల వర్షం కురిసింది. చిల్లులు

పడిన కారు మెలికలు తిరుగుతూపోయి, ఒక గోడకి గుద్దుకొని ఆగిపోయింది.

ప్రాణాలమీద ఆశ చావని చుంగ్ మిన్ అలానే బయటికి రాబోయాడు. అదే క్షణంలో అతని కారుమీద హేండ్ గ్రనేడ్ పడి గుభిల్లుమన్న పెద్ద శబ్దంతో తునా తునకలయిపోయింది కారు.

పాలెస్ లోపల కాల్పులు ఆగిపోయాయి. సైనికులు పోలీసులు లొంగిపోతున్నారు విప్లవదళం సభ్యులకి. ఒక్కొక్కరే బయటకు వస్తుండటం చూశాడు మనోహర్.

అయితే వారిలో జార్మన్ కాబోయే భార్య జోనీ కన్పించలేదు. ఏమయినట్లు?

చటుక్కున అతనికి గుర్తుకొచ్చాయి జోనీ మాటలు.

"చుంగ్ మిన్ మరణించిన మరుక్షణమే జార్మన్ దేశ ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగించటం కళ్ళారా చూస్తాను. అప్పటికిగాని నాకు తృప్తిలేదు."

అంటే... రేడియో స్టేషన్లో వుండాలి.

"డామిట్, ఆలస్యం చేశాను" అనుకుంటూ కారుని వెనక్కి పోనిచ్చి, రేడియో స్టేషన్ వయిపు పరుగు తీయించాడు.

రేడియో స్టేషన్ చుట్టూ విప్లవదళ సభ్యులు కాపలా వున్నారు. పోలీసు కారు తమని సమీపించటం చూడగానే గన్స్ ఎక్కుపెట్టారు.

క్షణం ఆలస్యం చేసినా ఏమవుతుందో మనోహర్ కి తెలుసు. వెంటనే జేబులోంచి తెల్లని రుమాలుతీసి, బయట గాలిలో ఊపసాగాడు. లొంగిపోతున్నాననటానికి సూచన అది!

"ఎవర్నువ్?" గద్దించి అడిగా డొక విప్లవదళ సభ్యుడు.

"నా పేరు మనోహర్. జార్మన్, జానీలు లోప లున్నారా?" ఆత్రుతగా ప్రశ్నించాడు మనోహర్.

"ఎందుకు?" అనుమానంగా ప్రశ్నించాడు అతను.

మనోహర్ వెంటనే ఒక కాగితంమీద తన పేరు రాసి, అతనికి అందించాడు.

"దీన్ని జోనీకి ఇవ్వు. అర్జెంట్."

లోనికి పరుగెత్తాడతను.

అదే క్షణంలో ప్రజల నుద్దేశించి ప్రసంగించటం పూర్తయిన జార్మన్ వెనుదిరిగి స్తంభించిపోయాడు.

విప్లవదళం సెకండ్ కమాండర్ రోజర్ పిస్టలుతో జోనీ వెనుక నిలబడి ఉన్నాడు. జోనీ భయంతో వణుకు తోంది.

"రోజర్! ఏమిటది?" అరిచాడు జార్మన్.

"సారీ జార్మన్! నా పేరు రోజర్ కాదు. అత నెప్పుడో పరలోకంచేరుకున్నాడు. నా పేరు చాయింగ్. కై నా గూఢచారిని."

"మైగాడ్!" అదిరిపడ్డాడు జార్మన్.

"యస్. మీరిద్దరు చావబోతున్నారు. మీరు చావ గానే రేడియోలో నా అనుజ్ఞ విని మీ దళంలో ఉన్న సభ్యుల్ని నావాళ్ళు మట్టుపెడతారు. ఈ దేశం మా దేశ స్వాధీనం అవుతుంది" అన్నాడు వికృతంగా నవ్వుతూ చాయింగ్.

"యూ యిడియట్! రాస్కెల్..."తిడుతున్నాడు జార్మన్.

అదే క్షణంలో చాయింగ్ వెనుక ఎవరో కదిలిన చప్పుడయి, వెనుదిరగబోయాడు చాయింగ్.

మారు సెకనులోనే ధన్ ధన్ ధన్ మంటూ మెషిన్ గన్ చాయింగ్ శరీరాన్ని తూట్లు పొడిచాయి. నిలువునా కూలి పోయాడు చాయింగ్.

"సర్! మీ కోసం మనోహర్ అన్న వ్యక్తి వచ్చాడు. ఆ సంగతి మీతో చెప్పటానికి వస్తే యిక్కడ..."

"థాంక్యూ మనోహర్! నమ్మల్నే గాదు, మా దేశాన్ని కూడా రక్షించావ్" అనుకుంది ఫ్రాన్సిస్ నోని.

–: ఐ పో యిం ది :–